ప్రజాశక్తి

గురువారం 20 జూన్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

సమర్థవంతంగా మంత్రి స్వామి సమీక్ష

- తొలి సమావేశంలోనే తనదైన మార్కు
- క్షేత్రస్థాయి సమస్యలపై నిశిత పరిశీలన
- అడిగిన ప్రశ్నలకు అధికారుల మౌనం



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అధికారులతో సమీక్షను సమర్ధవంతంగా నిర్వహించారు. తొలి సమావేశంలోనే తన దైన మార్కును చూపారు. క్షేత్ర స్థాయిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై అధికారులను ఆరా తీశారు. మంత్రి అడిగిన ప్రశ్నలకు అధికారుల నుంచి మౌనం సమాధానమైంది.

జిల్లా అధికారుల పరిచయం కార్యక్రమం, ఆయా శాఖల పురోగతిపై జరిగిన సమావేశాన్ని మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి సమర్ధవంతంగా నిర్వహించారు. గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రస్తావించిన సమస్యలు నేటికి పరిష్కారం కాకపోవటంపై ఆరా తీశారు. అభివృద్ధి, సంక్షేమం ప్రాధాన్యతతో టిడిపి ప్రభుత్వం ముందుకెళుతుందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం పనిచేయాలని మంత్రి డిబివి స్వామి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అభివృద్ధికి తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. తమ హయాంలో అధికారులకు తగిన ప్రాధాన్యత ఉంటుందని, అవినీతి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

త్వరితగతిన గుండ్లకమ్మ మరమ్మతులు

గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులు త్వరగా చేపట్టాలని మంత్రి డిబివి స్వామి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ఈ అంశాన్ని లేవనెత్తారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ మరమ్మతులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ▶ 2లో



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ డిబిఎన్ స్వామి

'వెలిగొండ' పూర్తి చేసేందుకు చర్యలు

- త్వరలో ముఖ్యమంత్రితో సమావేశం
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ డిబిఎన్ స్వామి



పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల స్వప్నం వెలిగొండ ప్రాజెక్టను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలు స్పందన సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పాల్గొన్నారు. కలెక్టరేట్ వచ్చిన మంత్రికి కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్, ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్, జెసి ఆర్.గోపాలకష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. మంత్రితో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతిపై త్వరలో ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహిస్తామని, అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తొలుత అధికారులు వారిని ప్రజాప్రతినిధులకు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధ్యక్షత వహించారు. అనంతరం తాగు, సాగు నీరు, వైద్యం, పారిశుధ్యం, వ్యవసాయం, విద్యా శాఖలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఆర్‌ఒ ఆర్.శ్రీలత, ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ▶ 8లో

దేశ ప్రగతిలో వ్యవసాయానిదే కీలకపాత్ర

- వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోంది..
- స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ కులపతి అబ్దుల్ నజీర్



విద్యార్థికి గోల్డ్‌మెడల్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దేశ ఆర్థికాభివద్ధి, ప్రగతిలో వ్యవసాయం కీలకపాత్ర పోషిస్తోందని, స్థిరమైన వ్యవసాయం, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అనుసంధానాల కోసం సజనాత్మకంగా ఆలోచిస్తూ, వినూత్న పద్ధతిలో పరిష్కారాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర గవర్నర్, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్‌నజీర్ తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 56వ వార్షిక స్నాతకోత్సవం బాపట్లలోని వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బి.వి.నాథ్ ఆడిటోరియంలో బుధవారం ఘనం గా జరిగింది. ముఖ్య అతిధిగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మి దేవి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ ఉత్పాదకత, వనరుల వినియోగాన్ని పెంచడానికి కత్రిమ మేధస్సు, డ్రోన్, రిమోట్ సెన్సింగ్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ పరిశోధన విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. భారత దేశ అభివద్ధి, గ్రామీణ జనాభా సంక్షేమంలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. భారతదేశం ప్రపంచ వ్యవసాయానికి శక్తి కేంద్రంగా నిలుస్తోందన్నారు. మన దేశం ప్రపంచంలోనే అతిపెద్ద పాలు, పప్పులు మరియు సుగంధ ద్రవ్యాలను ఉత్పత్తి చేస్తోం దన్నారు. వ్యవసాయం తప్పుదోవ పడితే మిగతాదేదీ సరిగ్గా జరిగే అవకాశం ఉండదని పేర్కొన్నారు. వ్యవసాయ భవిష్యత్తు మీ భుజాలపైనే ఉందనే విషయాన్ని విస్మరించ రాదని విద్యార్థులనుద్దేశించి అన్నారు. వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని, ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులైన గ్రాడ్యుయేట్స్ అందరూ కీలక పాత్ర పోషించాలన్నారు. వ్యవసాయం కేవలం ఆహారాన్ని ఉత్పత్తి చేయడం మాత్రమే కాదు, ఇది మీ జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఓ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడమేనని ఆయన చెప్పారు.

ఈ విశ్వవిద్యాలయం వజ్రం లాంటిది..

వ్యవసాయ రంగంలో భారతదేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాలని ముఖ్య అతిధిగా హాజరైన డైరెక్టర్ జనరల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మరియు సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ డాక్టర్ హిమాన్షు పాఠక్ అన్నారు. రైతు సమాజానికి ఎనలేని సేవలు అందించిన ఈ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. మన దేశంలోని 77 వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఆచార్య ఎంజి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక వజ్రం లాంటి విశ్వవిద్యాలయం అని అభివర్ణించారు.

ఈ స్నాతకోత్సవంలో ▶ 2లో



కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

నేడు జిల్లాకు కేంద్ర బృందం

- రబీ పంటల నష్టాలను చూసేందుకు రాక
- మార్కాపురం, తర్లుబాడు మండలాల్లో పర్యటన
- రూ.29.39 కోట్లు పరిహారం కోరుతూ వ్యవసాయ శాఖ నివేదిక

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గడిచిన రబీలో పంట సీజన్‌లో తీవ్ర వర్షాభావం కొనసాగింది. పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. సకాలంలో వర్షాలు పడనందున వేసిన పంటలు కూడా దెబ్బతిన్నాయి. పొగాకు, మిర్చి వంటి పంటలు మినహా మెట్టపంటలు ఏవీ చేతికి అందలేదు. అన్నీ ఎండిపోయాయి. మరో వైపు సాగర్ కాలువకు నీరు లేక మాగాణి సాగు కూడా లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. పశువులకు కూడా నీళ్లు లేవు. చెరువులు ఎండిపోయాయి. వాగులు వంకల్లో నీళ్లు లేవు. వందలాది గ్రామాలకు ట్యాంకర్లతో నీటిని అందించారు. ఈ లోపు ఎన్నికలు రావడంతో ఎటువంటి సహాయక చర్యలు తీసుకోలేకపోయారు. వ్యవసాయశాఖ మాత్రం ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేసింది. పంట నష్టాలపై నివేదికలు తయారుచేశారు. జేడిఎ శ్రీనివాసరావు ప్రభుత్వానికి నివేదికలూ పంపారు. రబీలో జిల్లాలో 38 మండలాలుండగా 22 మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అన్ని రకాల పంటలకు నష్టం జరిగింది. మార్కాపురం, కనిగిరి డివిజన్లలో ఎక్కువగా పంట నష్టం జరిగింది. దర్శి నియోజకవర్గంలోనూ ఎక్కువ మండలాల్లో పంటలు సాగు కాలేదు. వేసిన పంటలూ దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. 29,713.64 హెక్టార్లలో వివిధ రకాల పంటలు వర్షాలు లేక ఎండిపోయాయి. 36,147 మంది రైతులు బాధితులుగా తేలారు. వీరికి ▶ 2లో

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు అత్యధిక ధర రూ. 335 పలికినట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం గ్రామాలకు చెందిన రైతులు 1,032 బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. అందులో 983 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 49 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 335, అత్యల్ప ధర రూ. 205, సరాసరి ధర రూ. 284.11పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి: కొండపి పొగాకు వేలం కేంద్రానికి జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 1,445 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,390 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 55 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.343, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.298.59 పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

ఆలయానికి దక్కిన భూములు

శింగరాయకొండ : పాత శింగరాయ కొండ శ్రీ వరహాలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి సంబంధించి గూడూరు దగ్గర ఉన్న భూమి దేవస్థానానికి దక్కినట్లు ఆయల చైర్మన్ పామర్తి మాధవరావు ఇ.ఒ. కష్ణవేణి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. గూడూరు మండలం నాయుడుపాలెం గ్రామంలో 99 ఎకరాల 93 సెంట్లు భూమిని 1896లో దాతలు దేవస్థానానికి రిజిస్ట్రేషన్ ద్వారా వీలునామా రాసినట్లు తెలిపారు. ఆ తర్వాత వారి వారసులు ఆ భూమి తమదంటూ కోర్టుకు వెళ్లినట్లు తెలిపారు. ఇటీవల దేవస్థానం ప్రధాన అర్చకుల సహకారంతో తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించగా ఆయన స్పందించి ఆ భూమిపై శ్రీ వరహాల లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానానికి పూర్తి హక్కులు ఉన్నాయని 99 ఎకరాల 93 సెంట్లకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. కోట్లాది రూపాయల విలువైన ఈ భూమి దేవస్థానం అభివద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరసింహ చార్యులు, పాలక మండల సభ్యుడు చిమట మాలకొండయ్య పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

పొదిలి : ఇటీవల పొదిలిలో ఆశా వర్కర్ వేధింపులు తాళలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఎఎన్ఎం విజయను తహశీల్దారు జియా ఎల్‌హక్ బుధవారం పరార్శించారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విజయను పరామర్శించి ఆమె యొక్క యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు.

మాగుంటకు సత్కారం

ప్రజాశక్తి-పొదిలి

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డిని ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఒంగోలులోని ఎంపీ నివాసంలో గజమాలతో మాగుంటను సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమిశెట్టి శ్రీదేవి, కారంశెట్టి కిషోర్, సోమిశెట్టి చిరంజీవి, టిడిపి నాయకులు జిలానీ బాషా, సంధాని, మదార్ వలి, పెరుమాళ్ల చెంచు, సామి సూరి, నరేష్, కారంశెట్టి నరసింహ, ఉస్మాన్, మట్టా అవినాష్. టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్ర సచివాలయంలో హోంమంత్రి వంగలపూడి అనితను పొదిలికి చెందిన టిడిపి బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేష్ బుధవారం యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమర్థవంతంగా మంత్రి స్వామి సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

భావిస్తుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్ట్‌ను సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ విషయమై మంత్రి డిబివి స్వామి విధంగా స్పందించారు. 2020 డిసెంబర్‌లో గుండ్లకమ్మ ప్రాజెక్ట్ 3వ గేటు కొట్టుకుపోయిందని, మరో ఏడాదికి 5వ గేటు కొట్టుకుపోయిందన్నారు. గత ప్రభుత్వం వాటికి మరమ్మతులు చేయటానికి ముందుకు రాలేదని, అప్పటి జల వనరుల శాఖ మంత్రి కాకమ్మ కబుర్లు చెప్పారన్నారు. గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను మంత్రి స్వామి ఆదేశించారు. గేట్ల మరమ్మతులకు అవసరమైన నిధులపై ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. ప్రాజెక్టుల ఎస్ఇ మాట్లాడుతూ దెబ్బతిన్న గుండ్లకమ్మ గేట్లను జులై 15 నాటికి పూర్తి చేస్తామని, మిగిలిన అన్ని గేట్ల మరమ్మతులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రజ సమస్యలపై స్పందించి మంత్రి డాక్టర్ డిబివి స్వామి తొలి సమావేశాన్ని సమర్థవంతంగా నిర్వహిం చటం పట్ల ఎంపి, ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు జిల్లాకు కేంద్ర బృందం

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.29.40 కోట్లు పరిహారం ఇవ్వాలని నివేదిక పంపారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను విడుదలచేయాల్సి ఉంది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వంలో మంత్రులు ఇపుడిపుడే బాధ్యతలు తీసుకుంటున్నారు. వ్యవసాయశాఖ పరంగా నిర్ణయాలు తీసుకోవాలి. జిల్లా అధికారులతో బుధవారం నాడు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సమీక్ష చేశారు. శాసనసభ్యులూ హాజరయ్యారు. జిల్లా నేతలు కూడా వీటిపై దృష్టి సారించాలి. రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కేంద్ర బృందం పర్యటన ఇలా..

రాష్ట్రంలో మూడు బృందాలు పర్యటిస్తున్నాయి. నెల్లూరు ప్రకాశం జిల్లాల్లో ఒక బృందం పర్యటిస్తుండగా దీనికి సిడబ్ల్యుసి డైరెక్టర్ ఎస్‌హెచ్ మున్నుజీ ఉపాధ్యాయ నేతృత్వం వహించనున్నారు. కేంద్ర పశుసంవర్ధక శాఖ డిప్యూటీ సెక్రటరీ ఎస్‌సీ కశ్యప్, కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మదన్‌మోహన్ మౌర్య, నీతి ఆయోగ్ సీనియర్ రిసర్చ్ ఆఫీసర్ అనురాధ బటాన తదితరులు ఉంటారు. గురువారం ఉదయం జిల్లాకు చేరుకుంటారు. ఉదయం ఒంగోలులో కలెక్టర్ దినేష్‌కుమార్ వీరికి నష్టాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారు. అధికారులతోనూ భేటీ అవుతారు. అనంతరం పశ్చిమప్రాంతానికి బయలుదేరుతారు. తర్లుబాడు మండలం పోతలపాడులో ఎండిన సాగునీటి చెరువును పరిశీలిస్తారు. అక్కడ నుంచి గానుకపెంట గ్రామంలో రైతులు, గ్రామస్తులతో పంటనష్టాలు, తాగునీటి సమస్య ఇతర కష్టాలపై వారితో మాట్లాడతారు. అక్కడ నుంచీ మార్కాపురం మండలం వేములకోటలోని చెరువును సందర్శిస్తారు. అనంతరం గొబ్బూరు గ్రామాన్ని సందర్శిస్తారు. ఇక్కడ కూడా రైతులు, గ్రామస్తులను కలిసి మాట్లాడతారు. అనంతరం విజయవాడకు వెళతారు.

దేశ ప్రగతిలో వ్యవసాయానిదే కీలకపాత్ర

(మొదటిపేజీ తరువాయి)

1576 విద్యార్థినీ విద్యార్థులు ఇందులో 1319 అండర్ గ్రాడ్యుయేట్, 193 పోస్ట్ గ్రాడ్యుయేట్‌తో సహా 64 మందికి పి.హెచ్‌డి డిగ్రీ సర్టిఫికెట్లు అందజేశారు. వీరిలో 895 మందికి ప్రత్యక్షంగా మరియు 681 పరోక్షంగా సర్టిఫికెట్లు అందజేశారు. 1964లో విశ్వవిద్యాలయం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు 35,245 అండర్ గ్రాడ్యుయేట్లు మరియు 11,446 పోస్ట్ గ్రాడ్యుయేట్లు పిహెచ్‌డిలతో సహ మొత్తం 46,691 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిదేవి తెలిపారు. అగ్రికల్చరల్ సైన్సెస్‌లో అత్యుత్తమ పరిశోధనలకు గాను డాక్టర్ ఎం.వి. రెడ్డి జాతీయ అవార్డు –2023 మరియు వి. రామచంద్రరావు జాతీయ పురస్కారం–2023ను డాక్టర్ శరత్ కుమార్ ప్రధాన్‌కు రాష్ట్ర గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎస్ అబ్దుల్‌నజీర్ అందజేశారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పామూరు

పామూరు పట్టణం లోని టివిఎస్ షోరూంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ గుడిపాటి రంగనాయకులు, మండల అధ్యక్షుడు షేక్ మౌలాలి కేకు కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర మాజీ యువజన కాంగ్రెస్ కార్యదర్శి మరియు సమన్వయ కమిటీ సభ్యులు వేల్పుల రాజశేఖర్, పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వర రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సంగటి మల్లికార్జునరెడ్డి, కనిగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్ పాషాహుస్సేన్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు షేక్ మౌలాలి, హనుమంతుని పాడు మండల అధ్యక్షుడు బలసాని కోటేశ్వరరావు,చంద్రశేఖరపురం మండల అధ్యక్షులు షేక్ హజరత్, పామూరు పట్టణ అధ్యక్షుడు షేక్ సుభాని, వెలిగండ్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నడవ అంకయ్య, షేక్ వసీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటా : సత్య

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజక వర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా వారికి అండగా ఉంటానని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. కొండపిలో బుధవారం విజయోత్సవ సభ నిర్వహించారు. సభలో సత్య మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల కృషి వల్లే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించినట్లు తెలిపారు. అనంతరం దామచర్ల సత్యను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.సుబ్బారామయ్య, కాలేషా, జనసేన మండల అధ్యక్షుడు విశ్వం, సుధాకర్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.



దామచర్ల సత్యను సన్మానిస్తున్న నాయకులు

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాచర్ల మండలం పాలకవీడు చెరువు కట్ట సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... రాచర్ల మండలం అనుమలవీడు గ్రామ సచివాలయ పరిధిలో విద్యుత్తు లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ నాయక్ తన విధుల్లో భాగంగా పాలకవీడు చెరువు కట్ట సమీపంలో గల విద్యుత్ స్తంభంపై మరమ్మతులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో ప్రమాద వశాత్తు విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో విద్యుత్ షాక్ తో స్తంభంపై నుంచి కింద పడిపోయారు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు విద్యుత్ అధికారులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు .పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు.

ఫార్మసీలో విద్యార్థుల హవా

ప్రజాశక్తి-మార్కాపురం

ఫార్మసీ ఫలితాల్లో స్థానిక జార్జి ఫార్మసీ కళాశాల విద్యార్థుల హవా కొనసాగింది. ఆంధ్ర కేసరి యూని వర్సిటీ విడుదల చేసిన మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో జార్జి బీఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దాసరి స్మైలీ, షేక్ నస్రీన్, కొప్పుల హర్షిత మొదటి మూడు స్థానాల్లో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ వై రాజా జయరావులు ఆ విద్యార్థులను అభినందించారు. ఆంధ్ర కేసరి వైస్ చాన్సలర్ ఎం.అంజిరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కేవీఎన్ రాజు తదితరులు జార్జిఫార్మసీ కళాశాల విద్యార్థులను అభినందించారు.



స్మైలీ



నస్రీన్

రైలు కిందపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-సింగరాయకొండ

రైలు కింద పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సింగరాయకొండ రైల్వే స్టేషన్ పరిధిలోని పాకల రైల్వే గేటుకు ఉత్తరం వైపున బుధవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పాకల గ్రామానికి చెందిన మారుబోయిన గోపికృష్ణ(27) అనే యువకుడు మతిస్థిమితం లేక మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి జేబులోని ఆధార్ కార్డును గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రైల్వే పోసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జార్జి' కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం

ఎపిపిజి సెట్ పరీక్షా ఫలితాల్లో మార్కాపురంలోని జార్జి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి ర్యాంకులు సొంతం చేసుకున్నారు. చివరి సంవత్సరం చదువుతున్న జొన్నలగడ్డ సతీష్ 88వ ర్యాంకు, పి.చందన 245వ ర్యాంకు రాష్ట్రస్థాయిలో సాధించారు. 1000 ర్యాంకు లోపల 35 మంది విద్యార్థులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను జార్జి విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపల్ డాక్టర్ రాజా జయరావు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.



సతీష్



చందన

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

కారు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని దిగువమెట్ట గ్రామం నల్లమల్ల అటవీ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. గిద్దలూరు నుంచి నంద్యాల వెళ్తున్న కారు, నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వస్తున్న లారీ రోడ్డు మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి -కనిగిరి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి బుధవారం కలిశారు. కనిగిరి నియోజకవర్గంలో పలు అభివద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కలెక్టర్ దినేష్ కుమార్‌కు అందజేశారు. వెనుకబడిన కనిగిరి ప్రాంతాన్ని అభివద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. ప్రణాళిక ప్రకారం కనిగిరి అభివద్ధికి కషి చేస్తున్నట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి - మద్దిపాడు

మలేరియా వ్యాధి నివారణపై ప్రజలలో చైతన్య తీసుకువచ్చేందుకు విస్తతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మద్దిపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా మద్దిపాడులోని ప్రభుత్వ బాలుర వసతి గహంలో డిడిటి బుధవారం స్ప్రే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నిర్మూలనకు డిడిటి మందు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ బాలకోటయ్య, ఎస్సి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాఘవులు, బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాము, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆంజనేయులు, భ్రమరాంబ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, టిడిపి నాయకులు సుధాకర్‌రెడ్డి, జనసేన మండల కన్వీనర్ మురళి పాల్గొన్నారు.

'సికిల్ సెల్'పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

విద్యార్థులకు అవసరమైన రక్తపరీక్షలు చేసి సికిల్ సెల్ ఎనిమియాను గుర్తించి మందులు ఉపయోగించి నివారించాలని ఐటిడిఎ పిఒ డాక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. పెద్దదోర్నాలలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో సికిల్ సెల్ ఎనిమియాపై బుధవారం అవగాహన కల్పించారు. పుట్టిన పిల్లలకు ఐదారు నెలల వరకూ ఈ వ్యాధి లక్షణాలు కనిపించవని తెలిపారు. వయసు పెరిగే కొద్ది లక్షణాలు బయట పడతాయని చెప్పారు. సాధారణ రక్తకణాల జీవిత కాలం 120 రోజులు వరకు ఉంటే సికిల్ సెల్ రక్తకణాలు 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటుందన్నారు. సికిల్ సెల్స్ కొడవలి ఆకారంలో ఉంటుందన్నారు. అందు వల్ల రక్తనాళాల్లో రక్త ప్రసరణ సరిగా ఉండదన్నారు. శరీర కణజాలాలకు ప్రాణ వాయువు సరఫరా తగ్గిపోతూ 15 ఏళ్లలోపునే చనిపోతుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఎం సురేష్ కుమార్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ పద్మావతి, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, యజ్ఞిక్, సాయి ప్రశాంతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సామ్యూల్ జోబ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిసిపల్లి : స్థానిక ప్రభుత్వ వైద్యశాల, సచివాలయం వద్ద సికిల్ సెల్ ఎనిమియా నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ మంజుల మాట్లాడుతూ ఎర్ర రక్తకణాలు తగ్గిపోవడం, అలసట, కళ్ళు పసుపు రంగులో మారిపోవడం, తీవ్ర మైన ఒళ్ళునొప్పులు, కీళ్లనొప్పులు సికిల్ సెల్ వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ యషిత, సిహెచ్ఒ లక్ష్మీ సుజాత, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గిద్దలూరు : సికిల్ సెల్ అనీమియా లేదా కొడవలి కణ రక్తహీనతను నివారించాలంటే అవగాహనతోనే సాధ్యమవుతుందని అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షరీఫ్ పేర్కొన్నారు. సికిల్ సెల్ నివారణపై స్థానిక అర్బన్ కాలనీ సచివాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షరీఫ్ హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, ఎఎన్ఎం ఖాసింబీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మద్దిపాడు : మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సికిల్‌సెల్ పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ రక్త కణంలోని ఒక జన్యువు సికిల్ సెల్ గాను మరొకటి మామూలుగా ఉంటే దాన్ని సికిల్ సెల్ క్యారియర్లు అంటారని తెలిపారు. దంపతుల ఇద్దరికి ఇలాంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టే పిల్లలకు రక్త కణాలలోని రెండు జన్యువులు వంపు తిరిగి ఉంటాయన్నారు. వారికి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారన్నారు. సికిల్ సెల్ వ్యాధికి సరైన మందులు లేనందున సికిల్ సెల్ క్యారియర్లను గుర్తించి వారి మధ్య వివాహాలను నిరోధించటం ద్వారా వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. వ్యాధి నిర్ధారణకు సంబంధించిన పరీక్షను ప్రాథమిక కేంద్రంలో చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన బొట్ల రామారావు

ప్రజాశక్తి-టంగుటూరు

వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని వైసిపి రాష్ట్ర బీసీ విభాగం జోన్ -5 ఇన్‌ఛార్జి తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పై జరిగిన దాడుల గురించి, పార్టీ ఓటమి గురించి జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అన్ని నియోజక వర్గాల్లోని కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్ర బాబును ఎమ్మెల్యే కొండయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన కలసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ప్రమాణ స్వీకారం జరుగనున్న నేపథ్యంలో సీఎం కలిసిన నియోజకవర్గంలోని పలు విషయాలు గురించి చర్చించారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు సజ్జా హేమలత ఉన్నారు.


చంద్రబాబుతో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య


సహాయం అందిస్తున్న ఆదర్శ యూత్

ఆదర్శ యూత్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బాపట్ల

ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ స్నేహితులంతా కలిసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తామని ఆదర్శ యూత్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మరుప్రోలు వారిపాలెంకు చెందిన బ్లెస్సి అనే 12ఏళ్ల పాపకు వెన్నుముక పక్కకు జరగడంతో మెరుగైన చికిత్స కోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్య ఖర్చుల నిమిత్తంరూ రూ.5వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ స్నేహితుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గనైజేషన్ ద్వారా వివిధ రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ప్రతి నెల ఇరువురికి సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నామని అన్నారు. తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మద్దిబోయిన గోపి, ట్రెజరర్ జోగి సువర్ణరాజు, కందుల శ్రీకాంత్, చెల్లి అశోక్ కుమార్ పాల్గొన్నారు.


సాగు కాలవను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

కాలవలు మరమ్మతులు చేయించాలి

ప్రజాశక్తి - చీరాల

రైతుల పంట పొలాలకు నీరు అందేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టి, రైతుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో పంట పొలాలకు సంబంధించిన సాగునీటి కాలువలను ఆయన బుధవారం పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంట భూములకు సంబంధించి మీరు సక్రమంగా అందేలా కాలువలను సక్రమంగా మరమ్మతులు చేయించాలని కోరారు. నీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో ముందుగానే మరమ్మత్తులకు సంబంధించిన కాలువలను గుర్తించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సమస్యలను సకాలంలో పురస్కరించాలని సూచించారు. ఈ నేపద్యంలో ఆయా ప్రాంతాల రైతులు ఎమ్మెల్యే కొండయ్యను కలిసి వ్యవసాయ సాగుకు సంబంధించిన సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై సంబంధిత అధికారులతో పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దేశంలో 20వ స్థానంలో ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

361మంది డ్రోన్ పైలట్‌లకు విశ్వవిద్యాలయంలో శిక్షణ

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు, విస్తరణ సేవలు, విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు కాను ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలో 20వ స్థానంలో నిలిచిందని విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి చెప్పారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం 56వ వార్షిక స్నాతకోత్సవంలో విశ్వవిద్యాల యంపై నివేదిక సమర్పించారు. విశ్వవిద్యాలయం అందుకున్న పురస్కారాలు, గౌరవాల గురించి వివరిం చారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు వివిధ జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచారని చెప్పారు. ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్కాలర్‌షిప్ అవార్డును అందుకుంది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో 2021లో అగ్రికల్చరల్, ఇంజినీరింగ్ రెండింటిలోనూ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లను పొందారన్నారు. 2022లో ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ క్షేత్ర పంటలలో 17మెరుగైన పంట రకాలను విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 10, జాతీయ స్థాయిలో 7రకాలు ఉన్నాయని చెప్పారు. వీటిలో ఏడు వరి రకాలు, రాగిలో రెండు, పెసర, పత్తి, కొర్ర, మినుము, శనగ, వేరుశెనగ రకాలు ఒక్కొక్కటి ఉన్నాయని తెలిపారు.


గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఉపకులపతి

2023లో వరి నాలుగు రకాలు, మినుము, పెసర సహా 9 మెరుగైన పంట రకాలు రాష్ట్ర స్థాయిలో విడుదల చేసినట్లు తెలిపారు. వేరుశనగ, బీడీ, పొగాకు అదనంగా వరి, పెసర, దేశీ బెంగాల్ గ్రాము, వేరుశెనగ జాతీయ విడుదల కోసం పది మెరుగైన పంట రకాలు గుర్తించబడ్డాయని తెలిపారు. పత్తి, చెరకు దిగుబడి, నాణ్యత, తెగుళ్ళు, వ్యాధులను తట్టుకోవడం వంటి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలలో ఈ రకాల్లో ప్రతి ఒక్కటి జనాదరణ పొందిన రకాలు కంటే మెరుగైనవని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయం నుంచి విడుదలైన వరి రకాలు రాష్ట్రంలో 87శాతం, వేరుశనగ 90శాతం, కంది 59.5శాతం, మినుము 49శాతం, పెసర 47శాతం పంట విస్తీర్ణంలో సాగులో ఉన్నాయని తెలిపారు.

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ వ్యవసాయ డ్రోన్ పైలట్ శిక్షణా సంస్థగా డిజిసిఎ సర్టిఫికేషన్ పొందిన మొదటి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయమని అన్నారు. ఇప్పటివరకు 20 బ్యాచ్‌ల డ్రోన్ పైలట్ శిక్షణ పూర్తయిందని తెలిపారు. 361అదీకృత వ్యవసాయ డ్రోన్ పైలట్‌లను తయారు చేసినట్లు వివరించారు. అవార్డుల ప్రదానోత్సవ సభను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్ర రావు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, శాసనసభ్యులు వేగేసిన నరేంద్రవర్మ, ఆర్డిఓ జి రవీందర్, బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రజల ఆశీస్సులతో వరుసగా ఐదు సార్లు ఎంఎల్‌ఏగా విజయం సాధించి మంత్రి పదవి చేపట్టాక మొదటిసారిగా మండలాని వస్తున్న సందర్భంగా పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్‌కు విచ్చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు బుధవారం ఘన స్వాగతం పలికారు. అడ్డరోడ్డు జంక్షన్‌లో ఉన్న స్వర్గీయ మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పుట్టావారిపాలెం గ్రామంలోని మంత్రి రవికుమార్ అతిథి గృహంలో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం నాడు చెప్పిన ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేశారని అన్నారు. పెన్షన్లు పెంపు అమలు, రాష్ట్రానికి జీవనాడి పోలవరం, రాజధాని నిర్మాణం, అభివృద్ధి విషయంలో ఒక ప్రణాళికతో ముఖ్యమంత్రి ముందుకు వెళ్తారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల షాక్ నుంచి వైఎస్ జగన్ ఇంకా కోలుకోలేదని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలన్ మస్క్ లా జగన్ మాట్లాడుతున్నారని అన్నారు. గెలిస్తే తన గొప్ప, ఓడితే ఈవీఎంల తప్పా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలిచినప్పుడు ఈవీఎంల గురించి తానేం మాట్లాడాడో ఒకసారి మననం చేసుకోవాలని అన్నారు. పరనింద, ఆత్మ స్తుతి మాని ఇకనైనా ఆయన ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తేలప్రోలు రమేష్, చేవూరి వాసురెడ్డి, మాజీ ఎంపీపీ అట్లా చిన్న వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సన్నెబోయిన గురు యాదవ్, గాడిపర్తి వెంకటరావు, పసుపులేటి కోటేశ్వరరావు, మాదాల సుబ్బారావు, దుద్దేలా గాలెయ్య, అట్లా పెద్ద వెంకటరెడ్డి, ధూపాటి ఏసోబు పాల్గొన్నారు.


గొట్టిపాటి హనుమంతరావుకు నివాళి అర్పిస్తున్న మంత్రి


అధికారులతో సమీక్షిస్తున్న నరేంద్ర వర్మ

ప్రతి ఇంటికీ మంచినీరు అందించాలి

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రతి ఇంటికి మంచి నీరు అందించే ప్రక్రియ వేగ వంతం చేయాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచించారు. నీటి సరఫరా విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. త్రాగునీటి కోసం కోసం తల్లడిల్లే పరిస్థితులు తలెత్త కుండా సమర్ధవంత ప్రణాళికతో ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని అన్నారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెరువుల్లో తూటి కాడ, గుర్రపుడెక్క తొలగించి నీటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి పథకాన్ని నూరు శాతం అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాకు చేపట్టే చర్యలపై సమీక్షించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఈ శ్రీనివాసరావు, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవాని పాలెం ఏఈలు మంజూరు భాష, దిలీప్, భాగ్యరాజు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరాకు చర్యలు

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో ఏమాత్రం అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులను చేపట్టాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం కురిసిన వర్షాలు, ఈదురుగాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో కూలిన కరెంటు స్తంభాలు, తెగిన వైర్లు, దెబ్బతిన్న ఫీడర్ల పునరుద్ధరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర సచివాలయం నుండి టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆయన బుధవారం సమీక్షించారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, తెగిన వైర్లు, దెబ్బతిన్న ఫీడర్లను యుద్ధ ప్రాతిపదిక పునరుద్ధరించాలని చెప్పారు. ప్రజలకు ఎటు వంటి అసౌకర్యంకలుగ కుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాబోయే 48 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం, అసౌకర్యం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని పలు విద్యుత్ సంస్థల సిఎండీలు టెలీకాన్ఫరెన్సులో పాల్గొన్నారు.



గొట్టిపాటి రవికుమార్

రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

పార్లమెంటులో కాంగ్రెస్ పక్షనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ ఇంఛార్జి అడుసుమల్లి కిశోర్ బాబు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రభుత్వ వైద్యశాల్లో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ పిసిసి కార్యదర్శి కోరే సురేంద్రనాధ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కబళా సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పివి సురేష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతగొర్ల శ్రీని వాస్ యాదవ్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు దొడ్డా రోజరాణి పాల్గొన్నారు.


జన్మదిన కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



తండ్రులను సత్కరిస్తున్న విద్యార్థులు

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - కర్లపాలెం

హైవెండ్ ప్రైమరీ హై స్కూల్ నందు ఫాదర్స్ డే వేడుకలు విద్యార్థులు, వారి తల్లి దండ్రుల నడుమ బుధవారం కోలాహలంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి వారి తండ్రితో వారికి గల అనుబంధాన్ని పంచుకున్నారు. ప్రతి విద్యార్థి వారి స్వహస్తాలతో తయారు చేసిన అభినంద పత్రికను వారి తండ్రికి అందించి, పాదాలపై పుష్పాలను ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉదయ చంద్రరావు, డైరెక్టర్స్ చాందినీ, వెంకట జ్యోతి పాల్గొని తండ్రంటే జీవితకాలం మనల్ని భుజాలమీద మోసి, మన ఉన్నతి కోసం పాటుపడే ఏకైన వ్యక్తి అని ఉపదేశించారు. కార్యక్రమాన్ని మేనేజింగ్ డైరెక్టర్ సాయి మహేంద్ర బాబు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు లక్ష్మీప్రసన్న, రఫీ, షర్మిల, రామలక్ష్మి, రజియా, సుమలత, గోపి, వసంత లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పొట్టేళ్ల పందేలు

బాపట్ల జిల్లా పొట్టేలుకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం. పాత శింగరాయకొండ శ్రీవరహాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకృష్ణయాదవ్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో పొట్టేళ్ల పందేలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలకు ఐదు జతలు పొట్టేలు వచ్చాయి. పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, మండల కార్యదర్శి చీమకుర్తి కృష్ణ, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, ఉప సర్పంచి నక్కా బ్రహ్మేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు, జిఎస్‌కె గ్రూప్స్ అధినేత గంజి ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. బాపట్ల, శింగరాయకొండ, పర్చూరు, మార్టూరు నుంచి వచ్చిన పొట్టేలు పోటీలో హోరాహోరీగా తలపడ్డాయి. బాపట్ల జిల్లా మద్దెన బోయినవారిపాలెంకు చెందిన మద్దినపోయిన రాము పొట్టేలు మొదటి బహుమతిని సాధించింది. విజేతకు టిడిపి నాయకులు నర్రా రాంబాబు రూ. 25 వేల నగదు అందజేశారు. పాత శింగరాయకొండ ఉప సర్పంచ్ నక్క బ్రహ్మేశ్వరరావుకు చెందిన పొట్టేలు ద్వితీయ బహుమతిని సాధించింది. విజేతకు వావిలేటిపాడు చెందిన పటాపంజుల కొండలు రూ. 20 వేల నగదు అందజేశారు. పర్చూరు చెందిన ఉప్పుటూరి శ్రీకృష్ణ యాదవ్ పొట్టేలు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతకు దాత కొనికి అమర్‌నాథ్ రూ.15 వేల నగదు అంజదేశారు. మార్టూరు గంగమ్మ తల్లి పొట్టేలు 4వ బహుమతిని సాధించింది. విజేతకు మించల బ్రహ్మయ్య రూ.12 వేల నగదు అందజేశారు. శింగరాయకొండ మండలం శానంపూడి పంచాయతీ పరిధిలోని పటికనేనివారిపాలెంకు చెందిన పసుపులేటి మహేష్‌యాదవ్ పొట్టేలు ఐదో బహుమతిని సాధించింది. విజేతకు రూ.10 వేల నగదు నిర్వాహకులు అందజేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున విచ్చేసి పొట్టేళ్ల పందేలను ఆసక్తిగా తిలకించారు.



పోటీ పడుతున్న పొట్టేళ్లు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పైపులైన్ పరిశీలన

ప్రజాశక్తి -కనిగిరి

పొదిలి నుంచి కనిగిరికి సాగర్ నీటిని సరఫరా చేసే పైపు లైన్‌ను పొదిలి వద్దకనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం పరిశీలించారు. సాగర్ నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నీరు సరఫరా జరిగేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగర్ జలాలను ముందుగానే నిల్వచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు.

'పల్లా' నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి- దర్శి : టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ నియమించడం పట్ల దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో యాదవ సంఘం నియోజకవర్గ నాయకులు బేల్లా శ్రీనివాసరావు యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు బుధవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, యాదవ సంఘం నాయకులు కృష్ణ, రమణ, బాలయ్య, శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తలారి కోటయ్య యాదవ్ పాల్గొన్నారు.

25 నుంచి బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రూడ్ సెట్ సంస్థలో ఈ నెల 25 నుండి బ్యూటీపార్లర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. అలాగే 18 -45 సంవత్సరాలు కలిగి ఉండి రేషన్ కార్డు మరియు ఆధార్ కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలంలో శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పించబడునని తెలియజేశారు. మరిన్ని వివ రాలకు 9492583484 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం : స్థానిక రెయిన్‌బో ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 594/600 మార్కులతో జిల్లాలో ద్వితీయ స్థానం, యర్రగొండపాలెం టౌన్ ఫస్ట్ సాధించిన నక్కా రోహిణికి రెయిన్ బో ఉన్నత పాఠశాల చైర్మన్, యర్రగొండపాలెం ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ రూ. 38,000లు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. 590/600 మార్కులు సాధించిన పాలకూరు లక్ష్మీ దేవికి రూ. 24,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దొంతా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ రెయిన్ బో ఉన్నత పాఠశాలలో చదివే ప్రతి మెరిట్ విద్యార్థికి ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ దొంతా కిషోర్ గౌడ్, ప్రిన్సిపల్ దొంతా నిఖిల కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శామ్యూల్ జోబ్‌కు సన్మానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పట్టణంలోని ప్రభుత్వ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తూ బదిలీపై వెళ్తున్న శామ్యూల్ జోబ్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీవో డాక్టర్ రవీంద్రారెడ్డి, ఎపిఎం సురేష్ కుమార్, డాక్టర్ శ్రీనివాసపరావు, మోడల్ స్కూల్ చైర్మన్ శ్రీనివాసులు, చింతల పంచాయతీ సర్పంచి భూమన్న పాల్గొన్నారు.

కార్మికులను బెదిరించడం తగదు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు పై బెదిరింపులు, వారి అక్రమ తొలగింపులను అరికట్టాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒ-2 టి. శ్రీనివాసులుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం. రఫీ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించకపోయినా వారు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నట్లు తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం మారిందని కొందరు వ్యక్తులు మానువాలని, రాజీనామా చేయాలని కార్మికులను బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు. ఈ చర్యలను తాను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఈ బెదిరింపులను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షులు టి. గురునాథం, కొండమ్మ, మరియమ్మ, నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ బాలనాగయ్య పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణమ్మ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

వైసిపి నాయకులు యిమ్మడిశెట్టి సుబ్బారావు, సత్యనారాయణ మాతమూర్తి యిమ్మడిశెట్టి వెంకట నారాయణమ్మ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. స్థానికమంజునాథ ఫంక్షన్ హాలులో నారాయణమ్మ దశదిశ కర్మ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యిమ్మడిశెట్టి సుబ్బారావు, సత్యనారాయణ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, సర్పంచి రామావత్ అరుణాబాయి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబులరెడ్డి, సూరె రమేష్, అబ్దుల్ మజీద్, చిన్న మస్తాన్‌రావు, వైసిపి నాయకుల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు : అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని, తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ఇచ్చిన హామీలు నెరవేర్చడం కష్టసాధ్యమని పేర్కొన్నారు. నెరవేర్చలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తామని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఐదు మండలాల నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబులరెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, సర్పంచులు రామావత్ అరుణాబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, జడ్‌పి కో ఆప్షన్ సభ్యుడు జయ్యద్ షాబీర్ బాషా, నాయకులు రాములు నాయక్, మోర్తాల సుబ్బారెడ్డి, సింగా ప్రసాద్, గురిజేపల్లి వలి, సూరె రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

హైస్కూల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.వెంకట్రావు, షేక్.పాదుషా కోరారు. యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పలు పాఠశాలలో పర్యటించారు. ఆ పాఠశాల్లోని సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పి.నాయబ్‌రసూల్, వీరాంజనేయులు, నాగరాజు, రవీంద్ర, సాంబశివరావు, నాగేంద్ర, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన వెంకట్

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్ర హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వంగలపూడి అనితను దర్శి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి గరికపాటి వెంకట్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాసరావు, తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసరావును గరికపాటి వెంకట్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

పాఠశాల భవనం పరిశీలన

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం బొద్దికూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం ముందుకు భాగంలో స్లాబ్ కొద్దిమేర పడిపోయింది. అందులో భాగంగా డిఇ రమణయ్య బుధవారం పరిశీలించారు. స్లాబ్ పడిపోయిన సమయంలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. దెబ్బతిన్న స్లాబ్‌కు మరమ్మతులు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు సహకరించాలని డిఇ కోరారు.

మిక్సీ బహూకరణ

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు దాతలు మిక్సీ బహూకరించినట్లు కేజీబీవీ ప్రిన్సిపల్ షేక్ రేష్మ బుధవారం తెలిపారు. పామూరు మండలం, చిలంకూరు గ్రామానికి చెందిన గరికపాటి రామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గరికపాటి లక్ష్మీనారాయణ రూ.8,600 విలువైన మిక్సీని బహూకరించినట్లు ఆమె చెప్పారు. పాఠశాలకు సహకారం అందించిన దాతకు కేజీబీవీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ షేక్ రేష్మ, దాత గరికపాటి లక్ష్మీనారాయణ, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు పంచాయతీ నిధులు గోల్‌మాల్

- లక్షలు దండుకున్న పంచాయతీ కార్యదర్శి, పాలకులు
- అధికారం తమదేనంటూ రెచ్చిపోయిన నేతలు
- 8నెలల్లో రూ.25లక్షలు గోల్ మాల్
- తనను ఎవరేమీ చేయలేరంటున్న పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - తర్లుపాడు

మండల కేంద్రమైన తర్లుపాడు పంచాయతీలో నిధులు యదేచ్ఛగా గోల్మాల్ అవుతున్నప్పటికీ ఉన్నతాధి కారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ఎనిమిది నెల ల నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా రూ.25 లక్షల నిధులు పంచాయతీ నుండి డ్రా చేశారు. ఎక్కువగా బ్లీచింగ్ పౌడర్, పారిశుద్ధ్యం, బోర్లు మరమ్మత్తులు, మరింత ఎక్కువగా డంపింగ్ యార్డ్ అభివృద్ధి కొరకంటూ నిధులు మింగేశారు. పారిశుద్ధ్య కార్మికులకు, టర్న్ కాక్ శాలరీ నిమి త్తం మాత్రం రూ.4.5లక్షలు జీతాల రూపంలో ఇచ్చారు. మిగతా సొమ్మంతా వివిధ కారణాలు చూపి ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా, తూతు మంత్రంగా అక్కడ క్కడ చిన్నపాటి పనులు చేసి నిధులు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికా రంలోకి రావడంతో మొత్తం అవినీతి వెలుగులోకి వచ్చింది.



తర్లుబాడు సచివాలయ భవనం

డ్రా చేసిన నిధులు మొత్తం గ్రామానికి చెందిన ఇద్దరు వైసిపి నాయకులు, కార్యదర్శి పంచుకున్నట్లు ఆరోపిస్తు న్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రజలు పంచాయతీ కార్యదర్శి ని ప్రశ్నిస్తే తాను దళిత నాయకుడిని, మీపై కేసులు బనాయిస్తానంటూ బెదిరింపులకు గురి చేస్తాడు. తనకు ఉన్నత అధికారుల నుంచి సహాయ సహకారాలు పుష్కలం గా ఉన్నాయని, తననేమీ చేయలేరంటూ బెదిరించాడు. ఉన్నతాధికారులకు సైతం మామూళ్లు పంపిస్తున్నానని ప్రజలతో బహిరంగంగానే అంటున్నాడు. వీరిపై దర్యాప్తుకు కూడా అధికారులు రాకుండా ముడుపులు సమర్పిస్తు న్నాడు. గతంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు 1300 చెత్తబుట్టలను అమ్ముకున్నాడు. అప్పట్లో కందు కూరు డిఎల్పిఒ చెత్తబుట్టల ఖరీదును పంచాయతీ కార్య దర్శి నుంచి వసూలు చేయాలని ఆదేశించాడు. కానీ ఆ అధికారిని కూడా మామూళ్లు సమర్పించి మేనేజ్ చేసుకు న్నాడు. ఇటీవల కాలంలో మార్కాపురం డిఎల్పిఒకి కూడా రూ.24వేలను ఇచ్చినట్లు తెలిపాడు. గత మూడేళ్ల నుంచి పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు చేసిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపితే ఎన్ని లక్షల గోల్మాల్ జరిగిందో బయటికి వస్తుందని టిడిపి నేతలు కోరుతున్నారు. గ్రామంలో పారిశుధ్యం పడకేసినప్పటికీ పారిశుధ్య పనులు చేస్తున్నట్లు ఎక్కువ నిధులు సొమ్ము చేసుకోవడం గమనార్హం. గ్రామంలోని ప్రతి వీధిలో లైట్లు వేసినట్లు రూ.1,31,000 నెలరోజుల క్రితం డ్రా చేశారు. కానీ ఏ వీధిలో చూసినా అంధకారమే దర్శనమిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మంచి పరిపాలనే టీడీపీ లక్ష్యం

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రజలకు మంచి పరిపాలన అందించడమే తెలుగుదేశం లక్ష్యమని మండల అధ్యక్షులు ఏపూరి భూపతిరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యా లయంలో తెలుగుదేశం నాయకుల తో కలిసి ఆయన విలేకర్లతో బుధవారం మాట్లాడారు. తెలుగుదేశం ప్రజలకు మంచి చేస్తుందని అన్నారు. ఎవరిపైన రాజకీయ కక్షలకు పాల్పడదని అన్నారు. స్థానిక గమేషన్ మిల్లు వద్ద వైసిపి దిమ్మెను తెలుగుదేశం వారు పగలుల కొట్టారనడం మంచి పద్ధతి కాదన్నారు. తెలుగుదేశం ఎప్పుడు అలాంటి పనులు చేయదని అన్నారు. తెలుగుదేశంలో షాడో ఎమ్మెల్యేలు ఉండరని అన్నారు. అలాంటి సంస్కృతి టీడీపీకి కాదని అన్నారు. వైసిపి నాయకులు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ షేక్ బాజీ, ఎస్సీ సెల్ నాయకులు దాస్, పిట్ల వసంతరెడ్డి, మద్దిబోయిన బుల్లయ్య, దొప్పలపూడి రాజశేఖర్, బోయిన ముసలయ్య పాల్గొన్నారు.ం

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు హర్షనీయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు


కనపర్తి సుందర్రావు

విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభు త్వ అందించే ప్రోత్సాహక పథకానికి గత ప్రభుత్వం అంబేద్కర్ పేరు తీసివేసి జగన్ పేరు పెట్టుకోవటాన్ని ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనపర్తి సుందరరావు ఖండిం చారు. టిడిపి ప్రభుత్వం ఆ పథకానికి మరల అంబేద్కర్ పేరు నామకరణం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి తన జేబులో డబ్బులు తీసి ఖర్చుపెట్టినట్లుగా అంబేద్కర్ పేరును తొలగించి తన పేరును పెట్టుకోవడం, ఈ పథకాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. అలాగే గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు సంబంధిం చిన 27పథకాలను తొలగించారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 27 పథకాలను ప్రవేశపెడుతూ మొదటిగా అంబేద్కర్ విదేశీ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టడం హర్షిస్తున్నామని అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల 27 పథకాలు అమలు చేస్తారని, నిరుద్యోగులకు మెగా డీఎస్సీకి మొదటి సంతకం చేసిన విధంగానే పెన్షన్లు అమలు చేయడం, పోలవరం, రాజధాని అభివృద్ధి చేస్తూ ముందుకు వెళుతున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి పోకూరి సురేంద్ర కుమార్, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సీఎంఓ శ్రీనివాసరెడ్డి

డ్రాపౌట్స్ నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలో దివ్యాంగ పిల్లలు ఏ ఒక్కరూ డ్రాప్ అవుట్ లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ ఎస్ శ్రీనివాసరెడ్డి సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అద్దేపల్లి ఎంపీ యూపీఎస్ పాఠశాల్లో నిర్వహిస్తున్న భవిత కేంద్రం నందు నూతనంగా గుర్తించిన దివ్యాంగ విద్యార్థులను పాఠశాల్లో బుధవారం చేర్పించారు. ఈ విద్యార్థులకు విద్యా కానుక కిట్లు, అడ్మిషన్ ప్రవేశం కల్పించారు. ఈ నెల 12 నుండి నేను బడికి పోతా కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్న వారిని, మైనార్టీ విద్యార్థులు, దివ్యాంగ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నీలం దేవరాజ్, ఎల్ఎ ఎస్‌సి కోఆర్డినేటర్ సత్యసాగర్, భవిత కేంద్రం ఐఈఆర్‌టి దత్తాకర్, సైకో తెరపిస్ట్ శరత్, సిఆర్పి సలోమి ఉన్నారు.

వైసీపీ గూండాల దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కని వైసిపి నాయకులు, గుండాలు ఇంకా అధికారంలోనే ఉన్నట్లుగా భ్రమలో ఉండి టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయటం హేయమైన చర్యని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక టిడిపి కార్యా లయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో బౌద్ధ స్థూపం పక్కనున్న పంచాయతీ చెరువు ఎన్నో ఏళ్లుగా రజకులకు చాపలపాట క్రింద ఇవ్వడం జరుగుతుందని, దానిలో పంచాయతీ సొమ్ము పోను మిగిలిన లాభాలు రజక సభ్యులందరూ పంచుకుంటూ ఉంటారని చెప్పారు. ఈ క్రమంలో ఈ ఏడాది సంఘ అధ్యక్షులు, టిడిపి నాయకు లుగా ఉన్న సుబ్బారావును వైసిపి నాయకుడు అదే సంఘానికి చెందిన వ్యక్తి కొల్లిపర పూర్ణచంద్రరావు చేపలు పట్టినప్పుడు ప్రతి ఏట సంఘంలోని ప్రతి కుటుం బానికి కేజీ చొప్పున చేపలు ఇస్తూ ఉండేవారని అన్నారు. ఈ ఏడాది ఎందుకు ఇవ్వలేదు అంటూ సుబ్బారావును మంగళవారం నిలదీశాడు. ఇంకా చేపలు పట్టడం పూర్తి కాలేదని, చివరిలో చూస్తానని సుబ్బారావు చెప్పినప్పటికీ వినకుండా తెలుగుదేశంలో ఉన్నాడనే కక్షతో బుల్లబ్బాయి దాడి చేసి గాయపరిచాడని ఆరోపించారు. గాయపడిన సుబ్బారావు అతనితోపాటు కట్టా శరత్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళుతుండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో వైసీపీకి బుల్లబ్బాయితో పాటు మొర్ల కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యుడు శ్రీనివాసరావులు కలిసి మరోసారి సుబ్బారావు, శరత్‌లపై దాడి చేసి గాయపర్చా రని అన్నారు. అదీకాక అంతు చూస్తామంటూ బెదిరించి నట్లు పేర్కొన్నారు. ఒకే సంఘటనలో రెండుసార్లు దాడికి పాల్పడిన వైసిపి కార్యకర్తలపై తెలుగుదేశం పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అధికారంలో ఉండగా ఇలాంటి అఘాయిత్యాలు, అరాచకాలు జరగడం దారు ణమని అన్నారు. వైసీపీ మూకలు అధికారం కోల్పోయిన ప్పటికీ తెలుగుదేశం కార్యకర్తలపై దాడులు చేయటం పట్ల టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు తగిన విధంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడ్ల జయశీలరావు, కుక్కల వెంకటేశ్వరరావు, జంగం సాంసన్, కంభం సుధీర్, బైలర్ నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తూనుగుంట్ల సాయిబాబా


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న రాంబాబు

మలేరియా నివారణకు చర్యలు

ప్రజాశక్తి - చుండూరు

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గదుల్లో దోమల నివారణకు మలాథియాన్ లార్వా సైడు మందులు పిచికారి చేసి తగిన జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి జూగుంట రాంబాబు సూచించారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలల గురుకుల పాఠశాల్లో బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థు లకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, బోదకాలు, మెదడువాపు, వంటి దోమ కాటు వల్ల వచ్చే కీటక జనిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఎవరికైనా జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకొని తగిన చికిత్సలు తీసుకోవాలని సూచించారు. మలేరియా వ్యతి రేక మాసోత్సవాల్లో భాగంగా వంటశాల, కిచెన్ రూమ్, వంట పాత్రలు, త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత పాటిం చాలని అన్నారు. వసతి గృహ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు వహించాలని ప్రిన్సిపాల్ ఎం లక్ష్మి నారాయణకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఉచిత విద్య, విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల కిట్లను ఉచితంగా అందజేస్తూ, సుశిక్షితమైన ఉపాధ్యా యులచే మెరుగైన విద్యాబోధన జరుగుతుందని విద్యా ర్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఎంఈఓ పి లాజర్ పేర్కొన్నారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని బుధవారం గూడవల్లి ఉర్దూ ప్రాథమిక పాఠశాల పరిధిలోని అంగన్‌వాడి సెంటర్ నందు నిర్వహించారు. ప్రీ ప్రైమరీ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రైమరీ స్కూల్లో చేర్పించేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు బుధవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన తొమ్మిది రకాలైన కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించు కోవాలని కోరారు. ఎంఈఓ టి నవీన్ కుమార్ మాట్లాడు తూ సుశిక్షితమైన విద్యా బోధన కొరకు తమతో పాఠశాల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పల్లపట్ల సిడిపిఒ అనసూయ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయడంతో పాటు మేలైన విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో గూడవల్లి సెక్టార్ సూపర్వైజర్ గౌరీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్రమ్ ఘోరి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం శ్రీనివాసమూర్తి

సేవ్ ఎనర్జీపై సదస్సు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని బొమ్మనంపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం సిహెచ్‌వి శ్రీనివాసమూర్తి అధ్యక్షతన సేవ్ ఎనర్జీ అంశం గురించి తెలిపారు. ప్రకృతి వనరులను ఏవిధంగా కాపాడుకోవాలో విద్యార్థులకు వివరించారు. విద్యుత్, బొగ్గు, పెట్రోల్ తదితర వనరులను కాపాడుకోవాలని చెప్పారు. సౌర శక్తిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కోవి శ్రీనివాసరావు, జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, మేదరమెట్ల శ్రీనివాసరావు, దామా నాగేశ్వరరావు, పి శంకరరావు, వెంకటరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఆయిల్ లీకేజీతో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక 132/33 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ లీకేజీ అయింది. దీనితో ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం రెండు గంటలపైన ఏర్పడింది. అయితే ఈ విషయాన్ని వెంటనే గుర్తించిన సిబ్బంది శాయ శక్తుల కృషిచేసి ఎలాంటి నష్టం జరగకుండా ఆయిల్ లీకేజీని అరికట్టి విద్యుత్ సరఫరా అంతరాయాన్ని తొలగించారు. విద్యుత్ శాఖ అధికారి జి వీరాంజనేయులు ఆధ్వర్యంలో వంతుల వారీగా విధులు నిర్వహించి మరమ్మత్తులు చేపట్టారు. సమాలంలో మరమ్మత్తులు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు. విద్యుత్ సిబ్బంది కట్టా నాగరాజు, కె వేణు, కె బాబురావు, బి హరికృష్ణ మరమ్మత్తులు చేశారు.

ప్రజాశక్తి
గురువారం 20 జూన్ 2024

నకిలీ విలేకరి బెదిరింపు

ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

ప్రజాశక్తి - చీరాల

ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నావు అంటూ స్కూల్ ప్రిన్సిపాల్‌ను బెదిరించిన నకిలీ విలేకరిపై ఒకటో పట్టణ పోలీసు స్టేషన్లో ఓ ప్రవేటు పాఠశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేశారు. పత్రికలో వార్త రాకుండా ఉండాలంటే తనకు నగదు పంపాలని వాట్సాప్‌లో ఫోన్‌పే క్యూ ఆర్ కోడ్ సైతం పంపించాడని బాధిత ప్రిన్సిపాల్ పోలీసులను ఆశ్రయించారు. గత 5 ఏళ్లగా పట్టణంలో 2నుండి 5ఏళ్ల చిన్నారులకు నర్సరీ నుండి యుకెజి వరకు 25మందితో ప్లే స్కూల్ నడుపుతున్నారు. ఓ వ్యక్తి నేను పిడిఎఫ్ విలేకరినంటూ ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేశాడని, మీ లొసుగులన్నీ తెలిసని ఫోన్ చేసి బెదిరించాడని తెలిపారు. తాను ఎంతఒకపైనే వార్తలు రాసానని బెదిరించి తనను భయభ్రాంతులకు గురి చేశాడని ప్రిన్సిపాల్ తెలిపారు. అన్ని అనుమతులతో ప్లే స్కూల్ నిర్వహిస్తున్నప్పటికీ బెదిరింపుల కాల్ రావటంతో తాను చేసేదేమీలేక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశానని తెలిపారు. పోలీసులు ఫిర్యాదును నమోదు చేసుకుని విలేకరి ఎవరనే అంశంపై విచారిస్తున్నారు.

చంద్రబాబుతోనే వికసిత ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్రంలో చంద్రబాబు విజన్, పవన్ కళ్యాణ్ ఆలోచన కేంద్రంలో మోదీ నాయకత్వంలో త్వరలోనే వికసిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణం జరుగుతుందని ప్రముఖ వ్యాపారవేత్త, టిడిపి నాయకులు వీరవల్లి శివరామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని నల్లూరిపాలెంలో బుధ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అనగాని సత్య ప్రసాద్‌ను రెవెన్యూ మంత్రిగా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే అది ఒక టీడీపీ ప్రభుత్వంలోనే జరుగు తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం సాకారమవుతుందని అనినారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడమే కాకుండా రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత వైసిపి పాలనలో ఐదేళ్లు అభివృద్ధి కనిపిం చకుండా పోయిందన్నారు. త్వరలోనే అద్భుతంగా అమ రావతి నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. అలాంటి సమయంలో అమరావతిని రాజధానిగా చంద్రబాబు ప్రకటించి నిర్మాణ పనులు చేపట్టారని చెప్పారు. అమ రావతి నిర్మాణానికి అక్కడి రైతులు 33వేల ఎకరాలను చంద్రబాబును నమ్మి అప్పజెప్పారని అన్నారు. చంద్ర బాబు నాయకత్వంపై అక్కడి రైతులకు అంత నమ్మకం ఉందని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులను వైసిపి ప్రభుత్వం హింసించిందని అన్నారు. మహిళా రైతులను సైతం వైసిపి ప్రభుత్వం వేధించిందని అన్నారు. అయినప్పటికీ 1500రోజుల పైబడి పోరాటం చేసి మహిళా రైతులు ఓటుతో వైసిపికి బుద్ధి చెప్పారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మంచి రోజులు వచ్చాయన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక పంచాయితీ భవనం శిథిలావస్థకు చేరిన విషయం పాఠకులకు విధితమే. అయితే ఈ భవనం గత రెండు రోజుల క్రితం కురిసిన కొద్దిపాటి వర్షానికి భవనంపై పిట్ట గోడ పడిపోయింది. దీనికి తోడు వర్షంతో నీళ్లపై నుంచి కింది భవనం స్లాబ్‌కు కూడా నీటి చెమ్మ దిగడంతో కొన్ని వస్తువులు తడిసినట్లు సమాచారం. పంచాయితీ రాజ్ డిఈ వి భూషణరావు దెబ్బతిన్న పంచాయితీ భవనాన్ని, లోపలి భాగాలను బుధవారం పరిశీలించారు. సందర్భంగా ఆయన కార్యదర్శి నాగయ్యతో మాట్లాడుతూ భవనం పూర్తిగా దెబ్బతిని ఉందని తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితిలో భవనం ఉందని అన్నారు. ఉద్యోగస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏలాంటి నష్టం, ప్రాణహాని జరగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ ఉన్నత అధికారుల దృష్టికి వెంటనే తీసుకువెళ్లి భవనాన్ని తొలగించే ప్రయత్నం చేపడుతానని అన్నారు. స్థానిక అధికారులు పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు దృష్టికి భవనం దెబ్బ తిన్న విషయాన్ని తీసుకుపోవాలని సూచించారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్లు

అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గాలి ప్రభావంతో సముద్రంలో సుడులు ఏర్పడటం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, యాత్రికులు అప్రమత్తంగా వ్యవహరించాలని, పోలీసుల సూచనలు పాటించాలని ఎస్పీ వకుల్ జిందాల్ యాత్రికులకు సూచించారు. సూర్యలంక సముద్రతీరంలో బుధవారం వేరువేరు ఘటనల్లో సముద్రంలో కొట్టుకు పోతున్న 6గురు యాత్రికుల ప్రాణాలను సివిల్, మెరైన్ పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు కాపాడారు. గుంటూరు పట్టణానికి చెందిన విష్ణుశెట్టి రామ కృష్ణ, బాపట్ల పట్టణంలోని రైలుపేటకు చెందిన షేక్ సిద్ధు, పూసా మణికంఠ, కర్లపాలెం మండలం ఎంవి రాజుపాలెంకు చెందిన అట్ల వెంకటేశ్వరరెడ్డి, జార?ండ్ రాష్ట్రానికి చెందిన రాజ్ కుమార్ యాదవ్, బిన్ యాదవ్‌లు సముద్రంలో మునుగుతూ అలల తాకిడికి కొట్టుకు పోతుండగా విధుల్లో ఉన్న సివిల్, మెరైన్ పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు తమ ప్రాణాలు సైతం లెక్కచెయ్యకుండా సముద్రంలోకి వెళ్లి యాత్రికులను ఒడ్డుకు తీసుకు వచ్చి ప్రథమ చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడారు. ధైర్యసాహసాలు చూపిన హెడ్ కానిస్టేబుల్ మస్తానరావు, కానిస్టేబుల్ ఎన్ నాగరాజు, హోంగార్డులు కె నాగరాజు, కె ఆశీర్వాదం, గజ ఈతగాళ్ళు కె సుబ్బారావు, కె సత్య నారాయణ, కె నాగేశ్వరరావు, ఎస్ శివ గోపాల్, కె రామకృష్ణను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



ఆరుగురు యువకులను కాపాడిన పోలీసులు

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

వంశ పారంపర్యంగా తల్లిదండ్రుల నుండి సంక్రమించే సికిల్ సెల్ ఎనీమియా అనే వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని శాసన సభ్యులు వేగేసేన నరేంద్ర వర్మ అన్నారు. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ నయా అభియాన్ పథకం కింద భారత ప్రభుత్వం 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ ప్రారంభంలో భాగంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ స్పందన హాల్లో ఏర్పాటు చేశారు. సికిల్ సెల్ ఎనీ మియా వ్యాధి నిర్మూలన ప్రచార కరపత్రాలు, గోడ ప్రతులను అధికారులతో కలిసి ఎంఎల్ఎ నరేంద్రవర్మ ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్య విభాగం, గిరిజన సంక్షేమ శాఖ సేకరించిన సర్వే ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఈ వ్యాధి ఉందన్నారు. ఆ ప్రాంతాల్లో పుట్టిన బిడ్డ నుండి 40 యేళ్ళ వయసువారికి ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించడంతోపాటు నిర్ధారణ పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ వ్యాధిని సమూలంగా నిర్మించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి దూద్‌కొట్టి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ ఎం సౌజన్య, వైద్య ఆరోగ్య గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

జిలుగువారిపాలెంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రు పంచాయతీలోని జిలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు ఎంపీపీ డివి లలిత కుమారి చేతుల మీదగా పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ద్వారా సామాజిక స్పృహ, సమాజ విజ్ఞానం వంటి అనేక అంశాలు విద్యార్థికి అలవడతాయని అన్నారు. విద్యార్థులు మక్కువతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యను అభ్యసించే విధంగా తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం జనార్ధన, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గుండాల ఎస్తేరు రాణి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు బుస్సా విజయలక్ష్మి పాల్గొన్నారు.



పుస్తకాల పంపిణీ చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి

చోరీకి ఉపయోగించిన వాహనం పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల దొంగతనాలు అద్దంకి పరిసర ప్రాంతాల్లో అధికం అయ్యాయి. ఈపాటికే పోలీసు యంత్రాంగం దొంగతనాలు అరికట్టేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా మంగళవారం రాత్రి వెంపరాల గ్రామానికి చెందిన మాదాల రామకృష్ణకు చెందిన తన వ్యవసాయ భూమిలో కోళ్ల ఫారం నిర్మించుకునేందుకు రేకులు, ఇనుప పైపులు, సిమెంటు పోల్స్ ఇతర సామాగ్రిని పొలంలో ఉంచారు. ఆయన తన వ్యక్తిగత పనులపై వేరే గ్రామానికి వెళ్లి వస్తున్న సమయంలో తన వ్యవసాయ భూమి మీద వద్ద మినీ లారీ నిలుపుదల చేసి ఉండడం గమనించి దగ్గరకు వెళ్లి పరిశీలించాడు. అప్పటికే మినీ లారీలో తన పొలంలోని సిమెంట్ పోల్స్ ఎక్కించి ఉన్నారు. మీరు ఎవరని అడిగితే ఈ వస్తువులు కొనుగోలు చేశామని వాళ్లు ఆయనకు సమాధానమిచ్చారని రామకృష్ణ తెలిపారు. గత మూడు నాలుగు రోజుల నుండి ఇక్కడ వస్తువులు అన్నీ కూడా వీరు ఆటోలో తరలించారని తెలిపారు. ఆ సమయంలో దాదాపు 6 నుంచి 7 మంది యువకులు అక్కడ ఉన్నారని తెలిపారు. బాధితులు రామకృష్ణ వారెవరని వివరాలు అడిగాడు. చిన్న కొత్తపల్లి గ్రామమని తెలిపారని రామకృష్ణ ప్రజాశక్తికి తెలిపారు. ఆనవాళ్ల కోసం వీరందరినీ ఫోటోలు తీసుకుని వారిదగ్గ సెల్ ఫోన్లు కూడా తీసుకొని మినీ లారీని కూడా పొలం వద్ద ఉంచి ఆ యువకులు వెళ్లిపోయారు. బుధవారం ఉదయం బాధితుడు మాదాల రామకృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్లో మినీ లారీని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై బాధితుడు రామకృష్ణ పోలీసులకు వ్యక్తిగతంగా ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో ఈ యువకులు దాదాపు పొలాల్లోని పొగాకు గుచ్చుడు ఆకు తాళ్లను ఇతర వస్తువులను ఈ విధంగా తరలించుకు వెళ్తున్నారని సమాచారంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ ఘటనపై మరింత వివరంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఆర్థిక ప్రోత్సాహకం

విద్యార్థికి ఆర్థిక ప్రోత్సాహకం

ప్రజాశక్తి - అద్దంకి

నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గోరకాయపాలెం ఉన్నత పాఠశాల నందు గత సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి గజ్జల గంగయ్యకు స్థానిక నర్రావారిపాలెంకు చెందిన రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు నర్రా గోపాలరావు అయన తల్లిదండ్రులు వెంకటరావు, రంగనాయకమ్మ జ్ఞాపకార్థం రూ.5వేల నగదు బహుమతి బుధవారం అందజేశారు. కార్యక్రమానికి స్థానిక హెచ్ఎం లక్ష్మవరం సుజాత అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు భూదాటి సుధాకర రావు, ధర్మవరపు గంగాధరరావు, రోటరీక్లబ్ సభ్యులు మల్లాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, ఆర్టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు పిసిహెచ్ కోటయ్య, కరి రవి పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గత నెల 8న ప్రారంభించి 41రోజులు పాటు సపోర్ట్ సంస్థ, దాతల సహకారంతో నిర్వహించబడి ప్రజలందరితో ప్రశంసించబడిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం బుధవారం పాయసం, మజ్జిగ పంపిణీ చేసి ముగించారు. మజ్జిగ పంపిణీకి ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందజేసిన వారందరికీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. ముగింపు రోజు తోకల కృష్ణ మోహన్ ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, కోడూరి సుబ్రహ్మణ్యచారి, మున్నంగి వెంకట సుబ్బయ్య, అడ్డగడ శివరామకృష్ణ పాల్గొన్నారు.

టైరు పేలి బస్ షెల్టర్‌ను ఢీకొన్న ఆటో

ప్రజాశక్తి - చీరాల



మృతి చెందిన వృద్ధుడు మస్తాన్

ప్రయాణికులతో వెళు తున్న ఆటో టైరు ప్రమాదవశాత్తు పేలడం తో బస్సు షెల్టర్‌ను ఢీకొని ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వాడరేవు రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగింది. మండలంలోని వాడరేవు గ్రామానికి చెందిన మత్స్యకారులు సొంత పనులు ముగించుకొని చీరాల నుండి వాడరేవుకు అప్పి ఆటోలో వెళుతున్నారు. అయితే బుర్లవారిపాలెం మార్గం మధ్యలో ఒక్కసారిగా ఆటో టైరు పగిలిపోవడంతో ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న బస్సు షెల్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మస్తాన్ (65) అనే వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ ఇమ్మానియేలుతో పాటుగా ప్రయాణిస్తున్న ఎస్ లావణ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిరువురిని గుంటూరు హాస్పిటల్‌కు తరలించారు. దేవి, కుమారి అనే మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కావటంతో చీరాల వైద్యశాల్లో చికిత్సపొందుతున్నారు.

ప్రజలు విధిగా పరీక్షలు చేయించుకోవాలి

- వారసత్వంగా సికిల్ సెల్ ఎనీమియా - డిఎంహెచ్ఒ సురేష్‌కుమార్



ఎనీమియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సికిల్‌సెల్ ఎనీమియా వారసత్వంగా వస్తుందని, ప్రజలు విధిగా పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. ఒంగోలు గిరిజన భవన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గిరిజన సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం,హెచ్ఒ మాట్లాడుతూ కొండ ప్రాంతాలలో నివసించే గిరిజనులకు సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి వారస్వతంగా సంక్రమిస్తుందని, 40 సంవత్సరాల లోపు గిరిజనులందరూ విధిగా పరీక్షలు చేసుకోవాలన్నారు. సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి రక్త కణాల సంఖ్య తాగడం, కళ్ళు పసుపురంగులోకి మారడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు అవయవ వైఫల్యం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. గిరిజన ప్రాంతాలలో ప్రజలందరూ విధిగా పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాహుల్, జిల్లా గిరిజన అధికారి పి. జగన్నాధరావు. యన్.సి.డి. నోడల్ అధికారి డాక్టర్ భగీరధి, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, పట్టణ వైద్య అధికారులు, మాస్ మీడియా అధికారి డి. శ్రీనివాసులు, ఉప మాస్ మీడియా అధికారి సరోజిని ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటకు సత్కారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని బుధవారం ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో సంతనూతలపాడు మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి.. సత్కరించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ముస్లిం సంఘం నాయకులు పి.నాగూర్‌వలీ పాల్గొన్నారు.

కేంద్ర బృందానికి

సమగ్ర నష్ట వివరాలు అందించండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కరువును అంచనా వేసేందుకు జిల్లాకు వస్తున్న కేంద్ర బందానికి సమగ్రంగా నష్టం వివరాలను అందించేందుకు నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధికారులతో సమావేశమై ఈనెల 20న కేంద్ర బందం జిల్లా పర్యటనపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ నుంచి మార్చి వరకు మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులతో పంట నష్టం, రిజర్వాయర్లు, చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం సంబంధిత అంశాలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. పంట నష్టాలపై ఫోటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించాలని సూచించారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో రైతులతో ముఖాముఖి మాట్లాడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మొత్తం 38 మండలాల్లో 31 మండలాలను కరువు మండలాలుగా గుర్తించామని, యర్రగొండపాలెం, దోర్నాల, కురిచేడు, ముండ్లమూరు, దర్శి, పొదిలి, మర్రిపాడు, పెద్దారవీడు, మార్కాపురం, కంభం, తర్లుపాడు, హెచ్.ఎం.పాడు, వెలిగండ్ల, పెదచేర్లోపల్లె, సి.ఎస్.పురం, పామూరు, ఎస్.ఎం.పాడు, ఒంగోలు, కొత్తపట్నం, పుల్లలచెరువు 20 మండలాలను తీవ్రమైన కరువు మండలాలుగా గుర్తించామన్నారు. దొనకొండ, కొనకనమిట్ల, అర్ధవీడు, బెస్తవారిపేట, రాచర్ల, గిద్దలూరు, కొమరోలు, కనిగిరి, నాగులుప్పలపాడు, చీమకుర్తి, కొండపి 11 మండలాలను మోస్తారు కరువు మండలాలుగా గుర్తించటం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస్, సిపిఒ డి.వెంకటేశ్వర రావు, జడ్పీ సిఇఒ కె.మాధురి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబి రాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మర్ధన్ ఆలీ, డ్వామా పీడీ అర్జున్ రావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి వై. గోపిచంద్, ఎల్‌డిఎం రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఇంజినీర్స్ అసోసియేషన్ నేతలు

పలువురు ఎమ్మెల్యేలకు సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర సాంఘిక సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామిని ఏపి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎన్ఎస్‌పి అతిథి గృహంలో మంత్రి డాక్టర్ డిబివి స్వామిని కలసిన అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఒంగోలు మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు కందుల నారాయణ రెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డిలను ఒంగోలు కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా యూనిట్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఏఇఇ జిల్లా యూనిట్ ప్రెసిడెంట్ రాకేష్ బాబు, జనరల్ సెక్రటరీ సిహెచ్ తేజ్‌కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్ జె శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ నికేష్ పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్యలకు

శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు - మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో తాగు, సాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. అధికారులు కూడా ఈ దిశగా అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని, ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఒంగోలు స్పందన సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటుందని, ఉద్యోగులు, అధికారులు కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్యాంకర్ల ద్వారా నిబంధనల మేరకు నీటి సరఫరా చేయకపోయినప్పటికీ నకిలీ బిల్లులకు చెల్లింపులు చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెలిగొండ కుడికాలువకు పాలేరు, ముసి నదుల అనుసంధానానికి ప్రతిపాదనలు రూపొందించాలని స్పష్టం చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తామన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో సచివాలయాలు, వైద్యఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. మురుగు కాల్వలను తరచుగా శుభ్రం చేయించాలని ఆదేశించారు. 2019కి ముందు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు జూనియర్ కాలేజీలలో కొత్తగా అందుబాటులోకి తెచ్చి, అనంతరం 2020 తరువాత తొలగించిన కోర్సుల వివరాలను తనకు సమర్పించాలని జిల్లా సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కో-ఆర్డినేటర్‌ను మంత్రి ఆదేశించారు.

గురువారం జిల్లాలో కేంద్ర కరువు అధ్యయన బందం పర్యటించనున్న నేపథ్యంలో బాధిత రైతులకు న్యాయం జరిగేలా పూర్తి వివరాలను ఆ బృందం దష్టికి తీసుకువెళ్లాలని వ్యవసాయ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్‌కుమార్, మార్కాపురం కందుల నారాయణరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, వై.పాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు, డిఆర్ఒ ఆర్.శ్రీలత పాల్గొన్నారు.

దొంగ బిల్లులపై విచారణ చేయాలి



తమ ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా తాగు నీరు సరఫరా చేయకపోయినప్పటికీ దొంగ బిల్లులు పెట్టి సొమ్ము చేసుకున్న ఉదంతాలపై దర్యాప్తు చేయించాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంత్రిని కోరారు. వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస పరిహారం కోసం లబ్ధిదారులను గుర్తించడంలోనూ భారీగా అవకతవకలు జరిగాయని, దీనిపైనా ప్రత్యేక దర్యాప్తు చేయించాలని కోరారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పెంచాలి



అర్ధవీడు, గిద్దలూరు మండలాలలో నీటి కొరత అధికంగా ఉందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో పెన్షన్ పొందుతున్న చెవిటి వారిలో కొందరు అనర్హులుగా ఉన్నారని వీటిపై విచారణ జరిపించాలని మంత్రి, కలెక్టర్‌ను కోరారు.

సాగర్ జలాలు అందించాలి



కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉందని, సాగర్ నీరు కూడా తగినంత రావడంలేదని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. కాంట్రాక్టర్లకు, ఇతర పనుల నిర్వహణ కోసం అంటూ లక్షల్లో బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు.

ఎం బుక్ రికార్డింగ్‌లో లోపాలు



ఎం.బుక్ రికార్డింగ్లో లోపాలు ఉన్నాయని, ట్రిప్పుల సంఖ్యకు మించి ట్యాంకర్లకు బిల్లుల చెల్లింపు జరిగిందని యర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. వీటిపై విచారణ జరిపించాలని కోరారు.

ఫిల్టర్‌బెడ్ సమస్యను పరిష్కరించండి



దర్శి నియోజకవర్గంలో ఫిల్టర్ బెడ్ల సమస్య ఉందని, వీటిని సరిచేసేలా చూడాలని దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మంత్రిని కోరారు. డ్రైనేజీలు రెగ్యులర్‌గా బాగు చేయించాలని కోరారు.

'వెలిగొండ'కు ప్రభుత్వం ప్రాధాన్యం..



వెలుగొండ ప్రాజెక్టు త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గంలోని హెడ్ రెగ్యులేటర్ ఉన్న రెండు మండలాలను కూడా ప్రకాశం జిల్లా పరిధిలోకి తీసుకువస్తే భవిష్యత్తులో ప్రాజెక్ట్ నిర్వహణ సులభతరమవుతుందన్నారు. ప్రాజెక్ట్ నిర్వాసితులకు అవసరమైన పరిహారం నిధులను క్రమంగా ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేలా చూడాలని మంత్రిని కోరారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు నిధులు కూడా త్వరగా రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి సూచించారు.

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి



ఒంగోలు మండలంలో 15 రోజుల నుంచి తాగునీటి సమస్య ఉందని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారా.? అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మర్ధన్ ఆలీని ప్రశ్నించారు. మోటార్లు మరమ్మతులకు గురైన చోట తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలకు తీసుకోవాలన్నారు.

మంచినీటి నాణ్యత పెంచాలి



నియోజకవర్గంలో తాగునీటి నాణ్యత పెంచాల్సిన అవసరం ఉందని సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ కుమార్ తెలిపారు. ఫిల్టర్ బెడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంతనూతలపాడులో కొనసాగుతున్న ట్రిపుల్ ఐ.టి.ని ఇక్కడే ఉంచి త్వరలో ఏర్పడే మార్కాపురం జిల్లాలోని కనిగిరిలో కొత్త విద్యాసంస్థ వచ్చేలా చూడాలన్నారు.

పశువులకు నీటిసరఫరాకు చర్యలు



ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడడం కోసం ఆన్‌లైన్ ట్రాకింగ్ యాప్ వినియోగిస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. పశువులకు కూడా నీటి సరఫరా చేసేందుకు తగిన విధులు కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. తాగునీటి సమస్యలను తమ దష్టికి తీసుకురావడానికి జెసి ఆధ్వర్యంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు.

గంజాయిని నిర్మూలించేందుకు ప్రణాళిక



జిల్లాలో మాదక ద్రవ్యాలు, ముఖ్యంగా గంజాయిని నిర్మూలించేందుకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించామని ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ పేర్కొన్నారు. వందరోజుల్లో స్పష్టమైన మార్పు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళా పోలీసు విధులు, విధి విధానాలపై ప్రభుత్వం నుంచి మరింత స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు.